టౌన్ షిప్‌గా టిడ్కో అపార్ట్‌మెంట్లు

- బోడసకుర్రు టిడ్కో సముదాయంలో 1632 కుటుంబాలకు సొంత గూడు
- పక్కనే జగనన్న కాలనీతో మరో 280 కుటుంబాలకు నీడ
- త్వరలో అక్కడ జగనన్న మార్ట్ ఏర్పాటు

అమలాపురం టౌన్: పట్టణ పేదల కోసం అల్లవరం మండలం బోడసకుర్రులో నిర్మించిన టిడ్కో అపార్ట్‌మెంట్ల సముదాయం టౌన్ షిప్‌గా రూపాంతరం చెందుతుంది. అక్కడ 1632 కుటుంబాలకు సొంత గూడు ఏర్పాటుచేయడంతో సుమారు 5,000 మందికి ఆవాసం ఏర్పడింది. పైగా పక్కనే రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీలో మరో 280 కుటుంబాలు సొంత ఇళ్లు నిర్మించుకుంటున్నాయి. మొత్తంగా సుమారు 5,600 మంది జనాభా జీవనంతో అక్కడ ఓ టౌన్ షిప్‌ను, ఓ గ్రామాన్ని తలపించేలా మౌలిక సదుపాయాల కల్పన జరిగింది. దీంతో అక్కడి ప్రజలకు మార్కెట్ అవసరాలకు బయటకు వెళ్లే పని లేకుండా ప్రభుత్వమే సూపర్ మార్కెట్ తరహాలో అన్ని వస్తువులు విక్రయంతో అందుబాటులో ఉండేలా జగనన్న మార్ట్ మంజూరుచేసింది.

రూ.కోటితో అవుట్‌లెట్ డ్రైనేజీ మంజూరు

టిడ్కో సముదాయానికి చక్కటి సీసీ రోడ్డు, డ్రెయినేజీ వ్యవస్థ ఉంది. అయితే అపార్ట్‌మెంట్ల వాసులు వాడిన వాడకం నీరు ప్రస్తుతానికి నిర్మించిన డ్రెయిన్లలో పారి ఓ చోటకు చేరుతుంది. అయితే ఈ సమస్య వర్షాకాలం వస్తే డ్రెయిన్లు పొంగి కొంత ముంపు సమస్య వచ్చే ప్రమాదముంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని రూ.కోటి వ్యయంతో అమలాపురం మున్సిపాలిటీ పక్కాగా అవుట్‌లెట్ డ్రెయిన్‌ను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సహకారంతో అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు బోడసకుర్రు టిడ్కో ఇళ్ల సముదాయంలో సదుపాయాల కల్పనను పర్యవేక్షించడమే కాకుండా పారిశుధ్యం, డ్రెయినేజీ తదితర మౌలిక సదుపాయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. అలాగే టిడ్కో సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ దొండపాటి లలితకుమారి కూడా అపార్ట్‌మెంట్‌వాసుల పరిరక్షణ బాధ్యతలు చేపడుతున్నారు.


బోడసకుర్రు టిడ్కో అపార్ట్‌మెంట్ల సముదాయం

సొంతింటి కల నెరవేరింది



ఎన్నో ఏళ్లుగా ఉన్న మా సొంతి కల టిడ్కో ఇళ్ల పుణ్యమా అని నెరవేరింది. బోడసకుర్రు టిడ్కో అపార్ట్‌మెంట్లలో ఓ ప్లాట్ నాకు మంజూరైంది. దీంతో మాకు అద్దె ఇళ్ల బెడద తప్పింది. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన సొంత ప్లాట్‌లోనే జీవిస్తున్నాం.

– కె.విజయశ్రీ, లబ్ధిదారు, బోడసకుర్రు టిడ్కో ఇళ్ల సముదాయం

త్వరలోనే మార్టు ఏర్పాటు చేస్తాం



బోడసకుర్రు టిడ్కో అపార్ట్‌మెంట్ల వారి కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన జగనన్న మార్ట్ త్వరలోనే ఏర్పాటు చేస్తాం. టిడ్కో ఇళ్ల సముదాయానికి అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. అవుట్‌లెట్ డ్రెయినేజీని మున్సిపాలిటీ సహకారంతో త్వరలోనే నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అటు టిడ్కో అపార్ట్‌మెంట్లు, ఇటు జగనన్న కాలనీతో అక్కడ 5 వేల మందికి పైగా జీవించే ప్రజల మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది.

– డాక్టర్ దొండపాటి లలితకుమారి, సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్, బోడసకుర్రు టిడ్కో ఇళ్ల సముదాయం

మహిళా ఉపాధ్యాయులకు ముగ్గుల పోటీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో జిల్లా ఎస్టీయూ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు ఆదివారం ఉదయం నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు వేడుకగా జరిగాయి. మహిళా కన్వీనర్ వెలిగట్ల రత్నకుమారి పర్యవేక్షణలో మహిళా ఉపాధ్యాయులు పోటాపోటీగా ముగ్గులు వేశారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న కీర్తి బాల, శ్రీదేవి, శ్యామలకు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి చీరలు బహుమతులుగా అందజేశారు. మరో నలుగురికి కన్సొలేషన్ బహుమతులు ఇచ్చారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వైఆర్కే నాగేశ్వరరావు, వి.రత్నకుమారి వ్యవహరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నేరేడుమిల్లి సత్యనారాయణ, అభయ్ కన్వీనర్ సరిదే సత్య పల్లంరాజు, జిల్లా ఎస్టీయూ వాణి కన్వీనర్ చిక్కం మైనర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్టీయూ జిల్లా ప్రతినిధులు

గుణరంజన్‌కు రాష్ట్ర స్థాయి ఎక్స్‌లెన్స్ అవార్డు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన జిల్లా శ్రీసత్యసాయి బాల వికాస్ గురువు, జిల్లా విభాగ సమన్వయ కర్త శిష్ట గుణరంజన్‌కు పుట్టపర్తి శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ రాష్ట్ర స్థాయి ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రదానం చేసింది. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చైర్మన్ ఆర్జే రత్నాకర్, అఖిల భారత శ్రీసత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు నిమేష్ పాండ్యాల చేతుల మీదుగా ఆయనకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గుణరంజన్ తన పదో ఏట బాల వికాస్ విద్యార్థిగా చేరి తర్వాత బాల వికాస్ గురువుగా 35 ఏళ్ల నుంచి సత్య సాయి సేవల్లో నిమగ్నమయ్యారని చెప్పారు. అవార్డు అందుకున్న గుణరంజన్‌ను జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు అడబాల కొండబాబు, అమలాపురం జోనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ అభినందించారు.


శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధుల నుంచి ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంటున్న గుణరంజన్

బీమా రంగంలో ఏజెంట్లదే కీలక పాత్ర

అమలాపురం టౌన్: బీమా రంగంలో ఏజెంట్లదే కీలక పాత్ర అని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలో ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాత్ర సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఆదివారం జరిగిన ఏజెంట్ల సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అల్లవరం మండలం యెంట్రికోన సర్పంచ్, ఎల్‌ఐసీ ఏజెంట్ తిక్కిరెడ్డి నాగ వెంకట శ్రీనివాసరావు దంపతులను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సత్కరించారు. శ్రీనివాసరావు త్వరలో జరగనున్న మిలీనియర్ డాలర్ రౌండ్ టేబుల్ సమావేశానికి ఎంపిక కావడంపై అభినందించారు. కార్యక్రమంలో అల్లవరం మండల పరిషత్ అధ్యక్షుడు ఇళ్ల శేషారావు, అమలాపురం ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజర్ వై.శ్రీధర్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ప్రసన్నకుమార్, ఎల్‌ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.


సర్పంచ్ శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

చూపు లేకున్నా లోకాన్ని చదవగలరు

అమలాపురం టౌన్: చూపు లేకపోయినా తమ మనోనేత్రంతో లోకాన్ని చదివే అంధులు బ్రెయిలీ లిపితో తమ తలరాతలను మార్చుకుని మేధావులవుతున్నారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అంధులకు లిపిని కనుగొన్న లూయీ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలు స్థానిక భూపయ్య అగ్రహారంలోని శ్రీరామనగర్ అంధుల పాఠశాలలో ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో జరిగిన అంధుల కోనసీమ ఉత్సవాలను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ప్రారంభించి ప్రసంగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పంచాయితీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడులు లూయీ బ్రెయిలీ జయంతి కేక్‌ను కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ వేడుకకు ముమ్మిడివరం మండలం గేదెల్లంకకు చెందిన ఎన్ఆర్ఐ మంతెన ఎస్ఆర్ఎస్ఎల్ సత్య శ్రీనివాస చక్రవర్తిరాజు శ్రీసూర్య ఫౌండేషన్ తరపున ఆర్థిక సాయం సమకూర్చారు. అనంతరం అంధ విద్యార్థులు సినిమా పాటలు పాడి అందుకు అనుగుణంగా నృత్యం చేసి అలరించారు. కార్యక్రమంలో లూయీ అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ రామాయణం శ్రీనివాసరావు, జల్లి సుజాత, మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కోనసీమ అంధుల ఉత్సవాల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

ఇంటింటా అయోధ్య అక్షతల అందజేత


తాళ్లరేవులో అయోధ్య శ్రీరాముని అక్షతలను అందజేస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: పట్టణంలోని పలు వీధుల్లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధుల ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముని పూజిత అక్షతల వితరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్యంగా మహిళా ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి గృహిణులకు కుంకుమ బొట్టు పెట్టి అక్షతలు, కర పత్రాన్ని అందించారు. అమలాపురంలోని వీధివీధికి వెళ్లి అయోధ్యలో నిర్మించిన నూతన ఆలయం ప్రారంభోత్సవం గురించి వివరిస్తున్నారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులో అయోధ్య శ్రీరామ స్వర్ణ అక్షతలను ఆదివారం ఇంటింటికీ అందజేశారు. ముందుగా స్థానిక రామాలయంలో పూజలు చేసి సత్రంపేట, పెంకేవారిపేట తదితర ప్రాంతాల్లో ఊరేగింపుగా వెళ్లి భక్తులకు కరపత్రం, అక్షతలను ఇచ్చారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో జరిగే బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ గురించి వివరిస్తున్నారు. కార్యక్రమంలో చిట్టూరి చలపతి, అజయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న 1976-77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

46 ఏళ్ల తరువాత కలుసుకున్న విద్యార్థులు

ముమ్మిడివరం: నాలుగున్నర దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకున్నారు. ముమ్మిడివరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1976–77లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. జీవన గమనంలో ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా 46 ఏళ్ల తరువాత మళ్లీ కలుసుకోవడంతో ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాల దొంతరలను నెమరువేసుకుని నాటి చిలిపి అల్లరిని, గురువులతో తిన్న చీవాట్లను గుర్తుకు తెచ్చుకున్నారు. మళ్లీ చిన్న పిల్లలుగా మారిపోయి రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కోర్ల సుబ్బారావు, దొరయ్యనాయుడు, జగతా కేశవరావులను దుశ్శాలువాలతో సత్కరించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నముదూరి రామలింగశాస్త్రి, పసుమర్తి సుబ్రహ్మణ్యం, కాజులూరి రామలింగం, రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుపై వివాదం

అల్లవరం: మండలంలోని మొగళ్లమూరు సెంటర్‌లో బస్‌షెల్టర్ ఆనుకుని శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రే విగ్రహాన్ని ఏర్పాటుచేయడంపై స్థానికుల సమాచారంతో పోలీసులు విగ్రహాన్ని తొలగించి పంచాయతీలో ఉంచారు. దీంతో అదే స్థానంలో మళ్లీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ దళితులు ఆదివారం ఉదయం నుంచి ధర్నాకు దిగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ వీరబాబు, ఎస్ఐ హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. మూడు రోజుల క్రితం పంచాయతీలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై సమావేశం నిర్వహించగా వర్తక సంఘాల వారు వ్యతిరేకించారు. దీంతో అంబేడ్కర్ అభిమానులు రాత్రికి రాత్రి విగ్రహాన్ని ఏర్పాటుచేసినట్లుగా తెలుస్తుంది. దీనిపై ఎంపీ అనురాధ నివాసంలో డీఎస్పీ అంబికాప్రసాద్, స్థానిక పెద్దలు ఆదివారం ఇరువర్గాలతో చర్చలు జరిపిన తరువాత అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన స్థానంలోనే మళ్లీ ఏర్పాటు చేశారు.


మొగళ్లమూరులో నిరసన తెలుపుతున్న మహిళలు

అవార్డుల ప్రదానం

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్లో 25 మంది మహిళా ఉపాధ్యాయులకు సావిత్రీబాయి పూలే అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సామాజిక సేవకురాలు బండి రాధమ్మల చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్షుడు కేతా భాస్కర రామారావు, ఆర్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎ.శ్రీనుబాబు, జీవీ రమణ, నగభేరి కృష్ణమూర్తి, ధర్మాడి గౌరీశంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమాలోచన సమావేశం

అమలాపురం టౌన్: స్థానిక ముస్లిం షాదీఖానా భవనంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ వ్యతిరేక పార్టీలు, ప్రజాస్వామిక సంఘాలతో సమాలోచన సమావేశం ఆదివారం జరిగింది. కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరావు, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొరివి వినయకుమార్, శ్రీపతి ప్రకాష్, సాకే శంకర్, వడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అసోసియేషన్ వార్షికోత్సవం

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లిలో టెంట్ హౌస్, డెకరేషన్ లైటింగ్, సౌండ్ సిస్టమ్, జనరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మూడో వార్షికోత్సవం సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు చప్పిడి దుర్గారావు అధ్యక్షతన ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ జిల్లా అధ్యక్షుడు కట్టా వెంకటరమణ మాట్లాడుతూ అధికారులు ఉత్సవాలు, జాతర్ల సమయంలో వివిధ షరతులతో తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీదుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు దొనిపాటి బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

తాళ్లరేవు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ఆదివారం సుంకరపాలెంలో ఉత్సాహంగా జరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాభివృద్ధే దేశాభివృద్ధిగా భావించి ప్రధాని నరేంద్రమోడీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఎంపీడీఓ ఎం.అనుపమ వికసిత్ భారత్ యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొపనాతి దత్తాత్రేయ, విత్తనాల కరిమలస్వామి తదితరులు పాల్గొన్నారు.


వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ ఎం.అనుపమ తదితరులు

క్లుప్తంగా

వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


వీరేశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామివారి ఆలయంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు ప్రత్యేక దర్శనం చేయించగా పండితులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం ఎమ్మెల్యే పొన్నాడను దుశ్శాలువాతో సత్కరించారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆధ్యాత్మికవేత్త కుమార్ శంకర్‌గౌడ్ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక రావులచెరువు రోడ్డులో ఆదివారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గోశాల సేవకుడు, శ్రీరామ సేవా సమితి అధ్యక్షుడు గొవ్వాల అచ్యుతరామయ్య పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు గ్రైండర్, మిక్సీ, చీర బహుమతులుగా ఇచ్చారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్ శంకర్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, పేరూరు ఉపసర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, గొవ్వాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


విలసవిల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామ పంచాయితీ పరిధి బాలయోగి వారధి సమీపంలో రూ.10 లక్షల ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఊర్మిళాదేవి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వారికి సమస్య నుంచి ఉపశమనం లభించిందన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఆశపు బుజ్జి, బళ్ల నాగసతీష్, దుక్కిపాటి నాగరాజు, నూటికి సత్యనారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు, దాసరి శర్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందజేత

అమలాపురం రూరల్: మండలంలోని చిందాడగరువులో జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బళ్ల రెడ్డి, బళ్ల సత్యనారాయణ కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావు నిత్యవసరాలు, దుస్తులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ టీమ్ సభ్యులు నేరేడుమిల్లి శ్రీను, గంటా లక్ష్మీప్రసాద్, కుంచే అర్జున్, పరమట రాజేష్, మురళి, రాజు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల భారీ ర్యాలీ


అమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

అమలాపురం టౌన్: వచ్చే ఎన్నికల్లో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం హామీని ఇచ్చి మా పొట్ట కొట్టవద్దని రాజకీయ పార్టీలను అభ్యర్థిస్తూ ఆంధ్రా ఆటోవాలా వర్కర్స్ యూనియన్ జిల్లా శాఖ ఆటో కార్మికులు ఆదివారం అమలాపురంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైజంక్షన్ నుంచి 216 జాతీయ రహదారిపై రెండున్నర కిలోమీటర్ల మేర ర్యాలీ చేపట్టారు. స్థానిక గడియారం స్తంభం సెంటరు వద్ద యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం హామీ ఆలోచన ఉంటే విరమించుకోవాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ర్యాలీలో కార్మిక సంఘాల నేతలు కె.సత్తిబాబు, ఊటాల వెంకటేష్, బొక్కా శ్రీను, నెల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఐ అభ్యర్థిగా సిద్ధార్థ గౌతమ్

ముమ్మిడివరం: స్థానిక బుద్ధ పార్కు వద్ద నియోజకవర్గ కన్వీనర్ పంతగడ నరసింహమూర్తి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ భారత రిపబ్లికన్ పార్టీ(ఆర్‌పీఐ) అభ్యర్థిగా మట్టా సిద్ధార్థ గౌతమ్‌ను నియమించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం బుషి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి సిద్ధార్థ గౌతమ్ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. సమావేశంలో చీకురుమిల్లి శ్రీనివాస్, రాష్ట్ర కోశాధికారి బళ్ల సత్యనారాయణ, ఈవీవీవీ సత్యనారాయణ, గిడ్డి ప్రసాద్, రేవు శ్రీను, కలకట వెంకటరావు, చీకురుమిల్లి చిరంజీవి, మోకా కృష్ణమూర్త తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎస్ఆర్ఎస్‌కు విశిష్ట సేవా పురస్కారం


విశిష్ట సేవా పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరంలో జరుగుతున్న రాజరాజనరేంద్రుల వారి పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాల వేదికపై పట్టణానికి చెందిన కవి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరికి గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రరాయ్ రాజరాజ నరేంద్ర విశిష్ట సేవా పురస్కారం ప్రదానం చేశారు. ఈ నెల 5, 6, 7 తేదీల్లో అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో శ్రీనారాయణ భట్టు వేదికపై వెయ్యి మంది కవులతో జరిగిన కవి సమ్మేళనం, శతాధిక కవితా పఠనంలో కార్యక్రమాలకు ఆంధ్ర సారస్వత పరిషత్ జాతీయ సమన్వయకర్త హోదాలో డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి వ్యవహరించారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

అమలాపురం టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సమితి 49వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. కోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఎన్.బాలయోగి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత బుర్ర కథ, హరికథ, కూచిపూడి, జానపద నృత్యాలు తదితర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం పేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ,ముషిణి రామకృష్ణారావు, మాజీ మంత్రి పరమట వీర్రాఘవులు, మాజీ ఎంపీ బుచ్చి మహేశ్వరరావు, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్ర మూర్తి, కరాటం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

అమలాపురం రూరల్: మండలంలోని రెడ్డిపల్లిలో నూతనంగా మంజూరైన పింఛన్లు, పెరిగిన పింఛన్లను సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్యశ్రీకార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నల్లా సతీష్, రాజులపూడి మహేష్, రేలంగి ప్రవీణ్‌కుమార్, చింతపల్లి జ్యోతి, విజయలక్ష్మి, కాళ్ళ వెంకటలక్ష్మి, త్రిమూర్తులు, నాగేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

హాస్టల్ బాలికలకు రగ్గుల పంపిణీ

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి, గీతా ఫౌండేషన్ చైర్మన్ దేవరపల్లి గీత రగ్గులు, పండ్లను ఆదివారం పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులంతా అందిపుచ్చుకుని బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, పరమట సత్యనారాయణ, వరసాల సత్యనారాయణ, జొన్నాడ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా


నిరసన దీక్ష చేస్తున్న సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గత 13 ఏళ్లుగా సేవలు అందిస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది బకాయి జీతాలు విడుదల చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక జీజీహెచ్ ఎదుట నిరసన చేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానం

యానాం: కారైకల్‌లో నిర్వహించిన అండర్-20 స్టేట్ స్కూల్ గేమ్స్‌లో భాగంగా ఆదివారం నిర్వహించిన బాలుర బ్యాడ్మింటన్‌లో యానాం జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. విజేతలుగా నిలిచిన బి.సూర్యకిరణ్, మణికంఠ, చింతా సాత్విక్, ముఖేష్‌కుమార్‌లను ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

ఆబోతుని ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

అల్లవరం: తుమ్మలపల్లిలోని ప్రధాన రహదారిపై ఉన్న ఆబోతుని ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆంబోతుకి ఎడమ వైపున వెనుక కాలు విరగడంతో పాటు నాలుక పూర్తిగా తెగి వేరుపడింది. దీంతో ఆబోతు పడుతున్న బాధ అటుగా వెళుతున్న ప్రయాణికులతో కన్నీరు పెట్టించింది. స్థానికులు 1962కి సమాచారం అందించడంతో పశు వైద్యాధికారి తేజ ఆధ్వర్యంలో మొబైల్ అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకుని ఆబోతుకు చికిత్స అందించారు.